క్లుప్తంగా

ఘనంగా రథాంగ హోమాలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కూడేరు: కూడేరు శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ నూతన రథానికి ఆదివారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం నూతన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి రుద్ర సహకారం, రథాంగ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. హోమ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతి



మాట్లాడుతున్న కళ్యాణస్వామీజీ

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి గ్రామంలో ఆదివారం జగజ్యోతి విశ్వగురు బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెస్తరపల్లి జంబునాథేశ్వర ఆలయం నుంచి గ్రామ వీధుల గుండా బసవేశ్వర చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం విశ్వగురు బసవేశ్వర స్వామి జీవిత చరిత్రపై పలువురు వివరించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రియదర్శిని రాజు, లింగాయత్‌ల ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రవిశంకర్, మండల అధ్యక్షులు మేటి బసవరాజు, కళ్యాణదుర్గం అధ్యక్షులు యల్. బసవరాజు, శెట్టూరు అధ్యక్షుడు రమేష్, బ్రహ్మసముద్రం అధ్యక్షుడు మల్లికార్జున, కంబదూరు అధ్యక్షుడు మల్లన్న, బెలుగుప్ప అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శెట్టూరు: ఐదుకల్లు పరిసర ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్ఐ రాంభూపాల్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 9మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.42,200 నగదు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో పది మంది పరారయ్యారని తెలిపారు.

నీలగిరిస్వామికి పూజలు

వజ్రకరూరు: కురుబ వీధిలో వెలసిన నీలగిరిస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆకుపూజ, మహా మంగళ హారతి, తీర్థప్రసాదాల వినియోగం చేశారు.



అలంకరణలో నీలగిరిస్వామి

రైతుకు విద్యుత్ షాక్

బెళుగుప్ప: మండలంలోని రామసాగరం గ్రామానికి చెందిన రైతు బొడిమల్ల సంజీవరెడ్డి వ్యవసాయ తోటలో విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు.. సంజీవరెడ్డి తన వ్యవసాయ తోటలోని విద్యుత్ లైన్‌లో సమస్య తలెత్తింది. విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎంతకూ వారు స్పందించక పోవడంతో పంటకు నీరు పెట్టాలని ప్రాధేయపడ్డాడు. అయితే తాము ఎల్‌సీ ఇస్తామని, స్తంభం ఎక్కి మరమ్మతు చేసుకోవాలని సూచించడంతో సరేనని అంగీకరించాడు. అనంతరం ఎల్‌సీ ఇవ్వడంతో స్తంభం పైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కిందకు పడ్డాడు. కుటుంబసభ్యులు అతన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఛాతీ భాగంలో రక్త నాళాలు దెబ్బతిని రక్తం గడ్డ కట్టిందని, ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ గంగాధర్ మాట్లాడుతూ.. రైతు అభ్యర్థన మేరకు ఎల్‌సీ ఇచ్చే లోపు స్తంభం ఎక్కి ప్రమాదానికి గురైనట్లుగా తెలిపారు.

గౌరవం ఏదీ?

- ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వని కూటమి సర్కారు
- అధికారిక కార్యక్రమాల్లోనూ టీడీపీ వారికే ప్రాధాన్యత

ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల సమాచారం..	
మండలం	ఎంపీటీసీ సభ్యులు
ఉరవకొండ	23
బెళుగుప్ప	12
కూడేరు	11
వజ్రకరూరు	14
విడపనకల్లు	15

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ.3వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం ఎంపీటీసీలకు చెల్లించలేకపోయింది. 2024 జూన్‌లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి వేతనాలు రావాల్సి ఉందని ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు.



ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయం

నియోజకవర్గంలో టీడీపీ సభ్యులకే ప్రాధాన్యం:

నియోజకవర్గంలోని ఐదు మండలాలు ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు ఎంపీటీసీలు 90 శాతం వైఎస్సార్‌సీపీ వారే ఉన్నారు. అయితే అధికారులు ప్రొటోకాల్ ఏమాత్రం పాటించకుండా ఇద్దరు, ముగ్గురు టీడీపీ సభ్యులు ఉన్నా .. వారికే ప్రధాన్యత కల్పించడం తీవ్ర విమర్శలకు తావునిస్తోంది. ఇందులో భాగంగా బెళుగుప్ప మండల ఎంపీపీను మభ్యపెట్టి టీడీపీలోకి చేర్చుకున్నారు. మిగితా మండలాలకు ఎంపీపీలకు ప్రజాప్రతినిధులన్న గౌరవం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చినప్పటి నుంచి కేవలం మండల సర్వసభ్య సమావేశాలకు తప్ప తమను అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదంటున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లు పెడుతున్నాం



గతంలో ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వని మాట వాస్తవమే. బడ్జెట్ ఆలస్యం కావడం వల్ల ఎంపీటీసీలకు గౌరవ వేతనం జమ కాలేదు. ప్రస్తుతం బడ్జెట్ వచ్చింది. బిల్లు కూడా పెట్టాం. త్వరలోనే ఎంపీటీసీ సభ్యుల ఖాతాలకు గౌరవ వేతనం జమ అవుతుంది.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనంతో పాటు నిధులు, అలవెన్సులు కూడా ఇవ్వలేదు. ఎంపీటీసీ సభ్యులందరూ ఆర్థిక స్తోమత కలిగిన వారని ప్రభుత్వం పరిగణిస్తోంది. ఇప్పటికైనా గౌరవ వేతనాలు మంజూరు చేయాలి.

– జానికి, ఎంపీటీసీ–2 , ఉరవకొండ

పార్టీ శ్రేణులు అందుబాటులో ఉండండి

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య నియోజవర్గం వ్యాప్తంగా జూన్ 4న నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. దీంతో సోమవారం కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మండలాల్లో చేపట్టనున్న పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను తలారి రంగయ్య పరిశీలించనున్నారు. ఆయా మండలాల కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు నాయకులు, కార్యకర్తలు, అందుబాటులో ఉండాలని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలియజేశారు.

వ్యాయామంతో శారీరక దృఢత్వం

- ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి



క్యాడెట్లకు డ్రిల్ చేయిస్తున్న ఎన్‌సీసీ అధికారిణి

కూడేరు: ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా శరీరం దృఢంగా ఉండి, ఆరోగ్యంగా ఉండొచ్చని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో ఆరో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం ఆధ్వర్యంలో సీఏటీసీ–1 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం క్యాడెట్లకు డ్రిల్, మార్చ్‌ఫాస్ట్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండర్ మాట్లాడారు. విద్యా, ఇతర ఏరంగాల్లోనైనా రాణించాలంటే ఆరోగ్యం బాగుండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో 500 మంది క్యాడెట్లు , లెఫ్టినెంట్ ఎస్.పావని, మేజర్ బల్‌బీర్ సింగ్, జేసీఓలు కైలాస్ బంకర్, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు నవీన్ కుమార్, ఎం.ఎండీ ముదస్సర్, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉత్తమ జీవితం



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న వక్తలు

రాయదుర్గంటౌన్: విద్యతోనే ఉత్తమ జీవితం సాధ్యమని షేక్ అబ్దుల్ వకీల్ మహమ్మద్ మదనీ (ముంబాయి), షేక్ హఫీజ్ ఫరూక్ అబ్దుల్లా మదనీ (బెంగళూరు) పేర్కొన్నారు. పట్టణంలోని కణేకల్లు రోడ్డులోని మహమ్మదీయ అరబిక్ కళాశాల 99వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాలలో ఆలిం మౌల్వీ కోర్సు పూర్తి చేసుకున్న 31 మంది విద్యార్థులకు, హఫీజే ఖురాన్ పూర్తి చేసుకున్న 10 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మౌలానాలు మాట్లాడుతూ ఇస్లాం జ్ఞానం, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కళాశాల విద్యార్థులు, మౌలానాలు రచించిన అర్రష్డ్, అల్ సల్‌సబీల్ పుస్తకాలను అతిథులతో ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో హఫీజ్ ఫరూక్ అబ్దుల్లా, షమీమ్ అక్తార్ (బెంగాల్), మౌలానా అబ్దుల్ రవూఫ్ (తెలంగాణ), స్థానిక మదరసా మహమ్మదీయ అరబిక్ కళాశాల ప్రెసిడెంట్ నూరుల్లా ఖార్ జిరాని, కార్యదర్శి అమీర్ హమ్జా, ప్రిన్సిపాల్ అష్రఫ్ ఫైజీ, వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ అజీమ్, ప్రభుత్వ ఖాజీ అతావుర్ రెహమాన్, షేక్ అబ్దుల్ బారీ, వసీం ఖాజీ, మహమ్మద్ అమీన్ మదనీ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర సంప్రోక్షణ





రాగులపాడులో సంప్రోక్షణ పూజలు నిర్వహించిన దృశ్యం , కలశాలు ఏర్పాటు చేసిన దృశ్యం

వజ్రకరూరు: రాగులపాడులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ, పునఃప్రాణ ప్రతిష్ట ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, నాందీ పంచగవ్యం, రిత్విక్‌వరణం, కలశ స్థాపన, అష్టోత్తర శతసర్ప సూక్తపారాయణం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టోత్తర శత సర్పసూక్తం, సుబ్రహ్మణ్యేశ్వర అభిషేకం, సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిడిగల్లు సుబ్బయ్య శర్మ వంశస్తులు, పాటిల్ వంశస్తులు, రాగులపాడు పురోహితులు చక్రాల ఆదిశేష వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.



కూడేరు: నాటి గురువులతో 1999-2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

కూడేరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సందడి చేశారు. పాఠశాల వేదికగా ఆత్మీయ సమ్మేళనం పేరిట పూర్వ విద్యార్థులంతా కలిశారు. నాటి గురువుల ఆశీస్సులు పొందారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకొని, సంబరంగా గడిపారు. అక్కడే భోజనం చేసి, సరదాగా డ్యాన్సులు, ఆట పాటలతో సాయంత్రం వరకు గడిపారు. నాటి గురువులు చలమయ్య, రాంభూపాల్ రెడ్డి, ఓబుళమ్మ, అలివేలమ్మ, మంజువాణి మాట్లాడారు. 25 ఏళ్ల తర్వాత అంతా ఒకచోట కలిసి తమను గుర్తు పెట్టుకొని ఆహ్వానించడంతో సంతోషంగా ఉందన్నారు.

హెచ్చెల్సీ కార్యాలయ భవనానికి మోక్షమెప్పుడో?



అసంపూర్తిగా ఉన్న హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయ భవనం

కణేకల్లు : కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ కార్యాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఈ భవనానికి మోక్షమెప్పుడొస్తుందోనని అధికారులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. హెచ్చెల్సీ కాలువ నిర్మాణ సమయంలో కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్, విడపనకల్లు మండలాల రైతుల సౌకర్యార్థం కణేకల్లులో హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు ఎంతో ప్రయోజనకరమైన ఈ సబ్ డివిజన్ కార్యాలయం గురించి ఎవరూ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సబ్ డివిజన్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల్లో భాగంగా నూతన కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆ సమయంలో శరవేగంగా సాగిన ఈ భవన నిర్మాణ పనులు ఆ తర్వాత అర్ధంతరంగా నిలిచిపోయాయి.

దుస్థితికి చేరిన భవనం పైకప్పు..

సబ్ డివిజన్ కార్యాలయ భవన నిర్మాణంలో ఉండటంతో హెచ్చెల్సీ అధికారులు సెక్షన్ కార్యాలయంలో సబ్ డివిజన్ కార్యాలయాన్ని షిఫ్ట్ చేశారు. ఈ కార్యాలయం కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో మూడేళ్ల క్రితం హెచ్చెల్సీ అతిథిగృహంలో కార్యాలయాన్ని షిఫ్ట్ చేశారు. ప్రస్తుతం హెచ్చెల్సీ అతిథిగృహం కూడా శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు దుస్థితికి చేరుకుంది. గోడలు నెర్రెలు చీలాయి. రెండు, మూడ్రోజులు వరుసగా వర్షం వస్తే భవనం మొత్తం వర్షపునీరు కారుతోంది. గత్యంతరం లేక సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది ఇందులోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భవన సమస్య ఉన్నతాధికారులకు తెలిసినా వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

నీటి తొట్టెలు..నిరుపయోగం



కూడేరు వద్ద నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె

కూడేరు: మండల వ్యాప్తంగా వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు సుమారు 15 నీటి తొట్టెలు నిర్మించారు. అయితే నీరు నింపకుండా నిరుపయోగంగా వదిలేశారు. అసలే ఎండాకాలం.. నీటి కోసం మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తొట్టెల్లోకి నీరు నింపేందుకు చర్యలు చేపట్టాలని పశుపోషకులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన ఆటో కళ్యాణదుర్గం వైపు నుంచి ముద్దినాయనపల్లికి వెళ్తోంది. అదే సమయంలో మల్లిపల్లి గ్రామానికి చెందిన ఈరన్న ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గం వైపు వెళ్తున్నాడు. మల్లిపల్లి గ్రామం వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఈరన్న కాలు విరిగింది. స్థానికులు అతన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సనిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పొంచి ఉన్న ప్రమాదం



పాల్తూరు ఎస్సీ కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం



ప్రమాదం పొంచి ఉందని చెప్తున్న కాలనీవాసులు

విడపనకల్లు:మండలంలోని పాల్తూరు గ్రామంలో గాజుల మాల్లాపురం వెళ్లే రహదారి పక్కన ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉంది. సీసీ రోడ్డు నిర్మించే సమయంలో తొలగించకుండా రోడ్డు మధ్యలో అలానే ఉంచారని, శిథిలావస్థకు చేరుకున్నాయని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు విన్నవించినా ఫలితంలేకపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యావహారణం

- విచ్చల విడిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం
- 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కవర్లతో ప్రమాదం



రాయదుర్గంలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు



కంపోస్ట్ యార్డులోని ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న పశువులు

రాయదుర్గంటౌన్: పర్యావరణానికి అత్యంత హాని కలిగించే ప్లాస్టిక్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిషేధాజ్ఞలు ఉన్నాయి. అయినా పాలిథిన్ కవర్ల వినియోగం పెరిగిపోతోంది. క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాల్సిన అధికారులు.. పట్టించుకోవలేదన్న విమర్శలున్నాయి. రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో కవర్ల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. అధికారులు కేవలం హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే ప్లాస్టిక్ వాడకం పెరిగిపోతే పర్యావరణానికి ముప్పు తప్పదని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకర్గంలోని ఏ దుకాణం వద్ద చూసినా ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ కప్పుల్లో టీ, కాఫీలను, కూరగాయల, మాంసం.. ఇలా అన్ని ఆహార పదార్థాలను ఇస్తున్నారు. పర్యావరణ సమతుల్యత కోల్పోవడంతోపాటు శ్వాసకోశ, కేన్సర్ తదితర ప్రాణాంతక రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. గతేడాది జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ సంచులకే ప్రభుత్వం అనుమతుతి ఇచ్చింది. అంతకన్నా తక్కువ మందం ఉన్న సంచుల క్రయ విక్రయాలపై భారీ జరిమానాలు విధించడంతోపాటు చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించింది. అధికారులు మాత్రం తూతూమంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మాంసం దుకాణాలు, పండ్లు, పూలు, కిరాణా, హోటళ్లలో కవర్ల వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. వీధులు, రోడ్లు, కాలువలు, చెత్తకుప్పల్లో, హోటళ్ల వద్ద ఎటుచూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. ఈ వ్యర్థాలను మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయి. పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొస్తున్నా, వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో అధికారులు విఫలవుతుండడం వారి బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోంది.

ప్లాస్టిక్ వదిలేస్తేనే ఆరోగ్యం



ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలను తెచ్చుకోవడం వల్ల విషవాయువులు శరీరంలోకి చేరుతాయి. ఫలితంగా గ్యాస్ట్రిక్, శ్వాసకోశ సమస్యలతో పాటు కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న ఆవులు, బర్రెలు మృత్యువాత పడుతున్నాయి. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను పూర్తి వదిలేస్తేనే ఆరోగ్యానికి మంచిది.

– ఉమామహేశ్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, ఏరియా ఆస్పత్రి, రాయదుర్గం

ప్రజలు సహకరించాలి



రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. ఇక ముందు సింగిల్ యూజ్‌ను మరింత కఠినంగా అమలు చేయనున్నాం. ఇటీవల శానిటరీ విభాగం, సచివాలయ విభాగ సిబ్బందితో దాడులు నిర్వహించి అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం. ప్లాస్టిక్ విక్రయాలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా ప్రజలు సైతం స్వచ్ఛందంగా ప్లాస్టిక్ రహిత సంచులు వినియోగించి సహకరించాలి. వ్యాపారులు ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని దుకాణాలు సీజ్ చేస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

మజ్జిగ కేంద్రం ఏర్పాటు

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడులోని వజ్రకరూరు–విడపనకల్లు ప్రధాన రహదారి పక్కన భగవాన్ సత్య సాయిసేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి సందర్భంగా వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 41 రోజులపాటు మజ్జిగ కేంద్రం నిర్వహించనున్నట్లు సత్యసాయిసేవా సమితి సభ్యులు ఆదివారం తెలిపారు.